వ్యాధులు వైరల్


ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవల కోసం క్యూకట్టిన రోగులు



- చలి తీవ్రతతో రోగాలు విజృంభణ
- రోగులతో కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
- ఓపీ, ఐపీల్లో పెరుగుతున్న జ్వరపీడితులు

రాయదుర్గం: ఈ నెలలో తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మంచు కప్పేస్తోంది. చలితీవ్రత పెరుగుతోంది. దీంతో వైరల్ వ్యాధులు వణికిస్తున్నాయి. దీంతో చిన్నా పెద్దా తేడాలేకుండా రోగాలతో బాధపడుతున్నారు. చాలా మంది జ్వరాలు, దగ్గు, జలుబు, ఉబ్బసం, శ్వాసకోశ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. సాధారణ జ్వరాలతోపాటు వైరల్, డెంగీ, టైఫాయిడ్ కేసులు వస్తుండడంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రాయదుర్గం ఏరియా ఆస్పత్రితో పాటు కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ సీహెచ్‌సీలు, 30 పీహెచ్‌సీలు అదనంగా మరో 300 ప్రైవేట్ క్లినిక్‌లలో సుమారు ఐదు వేల మంది ఓపీ చికిత్సలకు హాజరవుతుంటారు. వీరిలో జ్వరాలతో బాధపడేవారి సంఖ్య అధికం. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల్లో ఐపీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. బెడ్లు కొరత లేకుండా సర్దుబాటు చేయాల్సి వస్తోంది. చలికాలం తగినంత పోషకాహారం, నీరు తీసుకోకపోవటంతో రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు వస్తాయని వైద్యులు చెప్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లి జేబులు గుల్ల చేసుకోకుండా ప్రభుత్వాస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని సూచిస్తున్నారు. చలి గాలికి జ్వరాలతోపాటు అలర్జీ సమస్యలు పుట్టుకొస్తున్నాయి. చాలా మంది చిన్నారులు నిమోనియా బారినపడుతున్నారు. ఈ లక్షణాలతో ఇటీవల రాయదుర్గం మండలం కాశీపురంలో ఇద్దరు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కేసుల తీవ్రత మరింత ఎక్కువ కనిపిస్తోంది. వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తూ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. తీవ్ర జ్వరం ఉన్నవారు సమీప ఆస్పత్రుల్లో చికిత్సలకు చేరుతున్నారు. ప్రతి ఇంట్లోనూ జ్వర బాధితులు పుట్టుకువస్తున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ...

- కలుషిత నీరు, మాంసాహారం తీసుకున్న వారికి టైఫాయిడ్, దోమకాటు బారిన పడినవారిలో వైరల్, డెంగీ జ్వర లక్షణాలు, రక్త కణాలు తగ్గుతాయి.
- దోమ తెరలు వాడడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- రోజూ మూడు నుంచి ఐదు లీటర్ల నీరు తాగడం మంచిది.
- జ్వరం తీవ్రత తగ్గకపోతే ఓఆర్ఎస్ ఎక్కువ తీసుకోవాలి.
- అస్తమా, ఆయాసం ఉన్న వారు మంచులో నడవాల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటించాలి.
- పొగ తాగేవారు చలిలో వాకింగ్ చేస్తే రక్తనాళాలు సంకోచిస్తాయి. బీపీ, షుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- ముఖ్యంగా చిన్నపల్లిల్లో చెవిపోటు, గొంతునొప్పి, జలుబు వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరశ్మి వచ్చిన తర్వాత వారిని బయటకు పంపించాలి.
- వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి. అందుకోసం పండ్లు, కూరగాయాలు ఎక్కువ తీసుకోవాలి. రోజూ ఉడకబెట్టిన గుడ్డు తీసుకోవాలి.

మెరుగైన వైద్యసేవలు



సాధారణ జ్వరాలతోపాటు వైరల్ కేసులు వస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే సంఖ్య అధికంగా కనిపిస్తోంది. వాటిని అదుపు చేసేందుకు కావాల్సిన మందులు, సరిపడా బెడ్లు అందుబాటులో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఎవరూ ఇబ్బందులు పడొద్దు. సీతా కాలం ముగిసే వరకు పిల్లలు, వృద్ధులు తెల్లారే సమయంలో చీకటి పడిన తర్వాత బయట తిరగడం మంచిదికాదు. వెచ్చని ఉల్లన్ దుస్తులను వాడుకోవాలి.

– మెర్సి జ్ఞానసుధ, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

పీహెచ్‌సీల్లోనూ మెరుగైన సేవలు



పీహెచ్‌సీల్లోనూ మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. సీజనల్ దృష్ట్యా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. వైరల్‌తో పాటు టైఫాయిడ్ కేసులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. దోమల బారి నుంచి కాపాడుకోవాలి. చలి కాలంలో ప్రబలే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం అని తెలియగానే సమీప ఆస్పత్రుల్లో సత్వరం చేరాలి.

– రమేష్, వైద్యాధికారి, గుమ్మఘట్ట

క్లుప్తంగా

ఇళ్ల స్థలాల కోసం ధర్నా


పి.నారాయణపురంలోని సచివాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో ఇంటి స్థలాలు కోసం పేద ప్రజలు శుక్రవారం సచివాలయం ఎదుట ధర్నాకు దిగారు. సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ ఐదు నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పాటు పడడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేశారు.

ఘనంగా కనకదాస జయంతి


కనకదాస విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని మల్లాపురం గ్రామంలో భక్తకనక దాస జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు జ్యోతులు , కలశాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి కనకదాస విగ్రహం వద్ద సమర్పించారు. గ్రామంలో కనకదాస విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, రవిస్వామి పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


నాటుసారా చూపుతున్న అధికారులు

కళ్యాణదుర్గం: ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పలుచోట్ల దాడులు చేశారు. కాపార్లపల్లికి చెందిన వడిత్యా చిట్టిబాయి ఇంటివద్ద నిల్వ చేసిన 3 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. బెళుగుప్ప మండలంలో పెనకలపాడు బస్టాప్ వద్ద 300 లీటర్ల ఎఫ్‌జే వాష్, తగ్గుపర్తి బస్టాండ్ వద్ద 200 లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఫణీంద్రకుమార్, కానిస్టేబుళ్లు శివానందరెడ్డి, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని కాపర్లపల్లిలో నాటుసారా విక్రయిస్తుండగా ఓ మహిళ నుంచి ఏడు లీటర్ల నాటుసారా శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ హసీనాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి

రాయదుర్గం: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీడీపీఓ పద్మావతి హెచ్చరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, పరిష్కారం) చట్టంపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కొండయ్య హాజరయ్యారు. నియోజకవర్గ స్థాయి మండల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ, ఎంపీడీఓ మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయన్నారు. పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే 2013 యాక్ట్ ద్వారా శిక్షర్హులవుతారని గుర్తు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, అంజినమ్మ, నాగరత్నమ్మ, జ్యోతిలక్ష్మి వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణాల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ చూపండి


మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం హనుమేష్

వజ్రకరూరు: స్త్రీనిధి రుణాల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏజీఎం హనుమేష్ సూచించారు. శుక్రవారం స్థానిక చంద్రోదయ మండల సమాఖ్య కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏజీఎం మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రికవరీలో పూర్తిగా వెనుకబడ్డారని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. జనవరి నుంచి కొత్తరుణాల మంజూరుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఏపీఎం గుణశ్యాం, స్త్రీనిధి మేనేజర్ హర్షవర్ధన్, వెలుగు సీసీలు యేషోబు, నారాయణస్వామి, వెంకటేష్, రామాంజినమ్మ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మహబూబ్‌బాషా శుక్రవారం పరిశీలించారు. ఈనెల 21న 'సాక్షి'లో «కష్టాలు అపార్‌ం» శీర్షికన ప్రచురితమైంది. తహసీల్దార్ మాట్లాడుతూ 2025 మార్చి 31 వరకు అపార్ జారీ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా ఆధార్ కేంద్రాలకు వెళ్లి తప్పిదాలను సరి చూసుకోవాలన్నారు.

ఆధార్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ను ఎంపీడీఓ నందకిశోర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ని ప్రజలు , విద్యార్థులు ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు , చేర్పులు ఉన్నట్లయితే వెంటనే తగిన ఆధారాలతో సరిచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 కృష్ణానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలం లాగుతున్న వృషభాలు

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరులో సర్మాస్ హుస్సేనీ స్వాముల ఉరుసుఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. 9 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నా యి. మొదటి బహుమతి రూ.15వేలు నక్క సురేంద్ర వృషభాలు, రెండో బహుమతి రూ.10వేలు ఆంజనేయగారి మల్లికార్జున వృషభాలు, మూడో బహుమతి రూ.8వేలు గౌరేష్ వృషభాలు, నాల్గో బహుమతి రూ.5వేలు కలేకుర్తి వంద్రప్ప వృషభాలు గెలుచుకున్నాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు నరసాపురం విద్యార్థి ఎంపిక


రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయిన విద్యార్థి యోగేంద్రతో ఉపాధ్యాయులు

బెళుగుప్ప:మండలంలోని నరసాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి హెచ్.యోగేంద్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు హెచ్ఎం బాలాజీ, పీడీ అమర్‌నాథ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 18న అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా క్రికెట్‌లో అండర్-17 విభాగంలో యోగేంద్ర పాల్గొన్నాడు.

భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి

ఉరవకొండ: ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి భూగర్భజలాలు పెంపునకు కృషి చేయాలని డ్వామా పీడీ సలీం తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను అధికారులతో కలిసి పీడీ పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఉరవకొండలో నేషనల్ వాటర్ అవార్డ్‌ను సాధించేందుకు ప్రత్యేకంగా 14 హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ఓపెన్‌ఫోరంలో రూ.9.29 లక్షలు రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శైలజ, ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఓ విమల పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే ఎలా?

వజ్రకరూరు: ఉపాధిహామీ పథకం అమలులో అధికారులు బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే ఎలా? అని ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీ సలీంబాషా అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై గ్రామాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రవిప్రసాద్, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, ఏపీఓ లక్ష్మీకాంతబాయి, ఈసీ ప్రభాకర్, ఏపీడీ అసిస్టెంట్ సుధాకర్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ఖలందర్ పాల్గొన్నారు.


షెడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ సలీం బాషా

షెడ్ల నిర్మాణాలను పరిశీలించిన డ్వామా పీడీ

కూడేరు: గొటుకూరు, జయపురం, చోళసముద్రం, కరుట్లపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో డ్వామా పీడీ సలీంబాషా శుక్రవారం పర్యటించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సిబ్బందితో సమీక్షించారు. ఏపీడీ శైలజ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి , ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవి, టెక్నికల్ అసిస్టెంట్లు సుగుణ, లక్ష్మీనారాయణ, జ నార్దన్, ఫీల్డ్ అసిస్టెంట్లు శిరీష, విజయ కుమార్ పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ పక్కాగా నిర్వహించాలి

కళ్యాణదుర్గం:మండలంలోని ముద్దినాయనపల్లి, గోళ్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల సంఖ్య, హాజరు, పౌష్టికాహారం అందించడంపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 8:30 గంటలకు తప్పకుండా కేంద్రాలను తెరవాలన్నారు.


ముద్దినాయనపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

ఆర్జిత సెలవుల బకాయిలు చెల్లించాలి

కణేకల్లు: ఆర్జిత సెలవుల నగదు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్‌టీయూ (స్టేట్ టీచర్స్ యూనియన్) జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని హనకనహాళ్, సొల్లాపురం, ఎస్.హనుమాపురం, కణేకల్లు జెడ్పీ బాలుర, బాలికల, ఉర్దూ, ప్రాథమిక, 43 ఉడేగోళం పాఠశాలల ఉపాధ్యాయులను ఎస్‌టీయూ నాయకులు కలిశారు. వారితో సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం కణేకల్లులో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు విలేకరులతో మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్జిత సెలవుల నగదు బకాయిల కోసం ఉపాధ్యాయులతోపాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. జీఓ 117ను రద్దు చేయాలన్నారు. పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ మండల నాయకులు కిరణ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.


హనకనహాళ్‌లో ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందిస్తున్న ఎస్‌టీయూ జిల్లా నాయకులు

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాయదుర్గం/ కణేకల్లు: మద్యం లైసెన్స్ పొందిన వారు బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామితో కలసి రాయదుర్గం, కణేకల్లులోని ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. కేసుల దర్యాప్తు, వాటి పురోగతిపై స్థానిక సీఐలు ఉమాబాయి, సోమశేఖర్, ఎస్ఐ పవన్‌కుమార్‌తో ఆరా తీశారు. మద్యం లైసెన్సు దారులు ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరపకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైసెన్సుదారులు బెల్టు షాపులు నిర్వహిస్తే రూ.5 లక్షల జరిమానాతో పాటు షాపు సస్పెండ్ చేస్తామన్నారు. రెండో సారి పట్టుబడితే లైసెన్సు పూర్తిగా రద్దుచేస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హరియన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు,రేపు ఓటరు నమోదు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఈనెల 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫారం-6, ఫారం-7, ఫారం-8 క్లెయిమ్‌లను స్వీకరించనున్నట్లు తెలిపారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో 23,24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.

డ్రై డేతో దోమల నివారణ

బొమ్మనహాళ్: గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడం వల్ల దోమలను నివారించొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, రమాదేవి, శశికళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకోవాలి

వజ్రకరూరు: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదివితే ఉన్నత లక్ష్యం చేరుకోవచ్చని ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తట్రకల్లు గ్రామంలోని కేజీబీవీలో వజ్రకరూరు పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు వాడకం కలిగే దుష్పరిణామాలు, ఫోక్సోయాక్టు, పిల్లల భద్రత, బాల్యవివా హాలు, అనర్థాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, సైబర్‌నేరాలపై తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిరుద్యోగులకు ఉచిత నైపుణ్య శిక్షణ

కళ్యాణదుర్గం: జిల్లాలోని నిరుద్యోగులకు కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏం, ఎంకాం పాస్/ఫెయిల్ అయిన 20 నుంచి 30 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. నిరుద్యోగులకు టాలీప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్‌పై శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9000487423లో సంప్రదించాలన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన ఓ చిన్నారి వైద్యానికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఉపాధ్యాయుడు బద్దేనాయక్ ఆర్థికసాయం అందించారు. శుక్రవారం పట్టానికి చెందిన దామోదర్ కుమార్తె లిఖిత అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యం ఖర్చులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. పట్టణ యువకులు రుహుల్లా, ప్రకాష్, ట్రస్ట్ వైస్‌చైర్మన్ సురేష్, కార్య దర్శి హరీష్, ప్రకాష్, సభ్యులు తిప్పేస్వామి పాల్గొన్నారు.


90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు

వజ్రకరూరు: ఐదు ఎకరాల పొలం ఉండి అర్హత ఉన్న ప్రతి రైతుకూ 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందజేస్తున్నట్లు ఏపీఎంఐపీ ఎంఐఏఓ శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాంపల్లి, జరుట్లరాంపురం, రాగులపాడు తదితర గ్రామాల్లో ఎంఐఏఓ పర్యటించారు. అనంతరం ఎంఐఏఓ మాట్లాడుతూ ఐదెకరాలున్న రైతులందరికీ 90శాతం రాయితీ, ఆపైన ఉన్న రైతులకు 70శాతంతో డ్రిప్ పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అంజని పైప్స్ ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

కంబదూరు: రాష్ట్ర ప్రభుత్వం మండలానికి 2024-25వ సంవత్సరానికి సంబంధించి15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడత బేసిక్ గ్రాంటు రూ.47,04,091, టైడ్ గ్రాంటు రూ.70, 56,136 చొప్పున మొత్తం రూ.1,17,60,227 ఆయా పంచాయతీల ఖాతాలో జమ చేసిందని ఏఓ తిప్పయ్య శుక్రవారం తెలిపారు. బేసిక్ గ్రాంటు అభివృద్ధి పనులకు, టైడ్ గ్రాంటును పారిశుధ్యం మెరుగునకు, తాగునీటి సరఫరా కోసం వినియోగించాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణాచేస్తే చర్యలు తప్పవు


టిప్పర్ డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

కణేకల్లు: ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని రచ్చుమర్రి ఇసుక రీచ్‌ను ఎస్ఐ నాగమధుతో కలిసి ఆయన పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇసుక లోడింగ్ చేయాలని నిర్వాహకులకు సీఐ సూచించారు. ఆ తర్వాత ఇసుక లోడింగ్ చేయరాదన్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు ఇసుక తరలించడం, రీసైకిల్ చేసి ఇసుక తరలించడం లాంటివి చేస్తే చర్యలు తప్పవని టిప్పర్ డ్రైవర్లకు సీఐ హెచ్చరించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీహీరేహాళ్ మండలంలోని ఓబుళాసురం చెక్‌పోస్టు సమీపంలో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బ ళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మారెన్న శుక్రవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వివాహిత మృతి..

డీ హీరేహాళ్ మండలంలోని మురడిలో ఈ నెల 10న శైలజ అనే వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉరవకొండ: మండలంలోని కోనాపురం సమీపంలో 42వ జాతీయ రహదారి వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమిద్యాల గ్రామానికి చెందిన సధాకర్, రాజమ్మ పెన్నహోబిలం నుంచి ముష్టూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, బళ్లారి నుంచి అనంతపురానికి వస్తున్న కారు ఢీకొనింది. దీంతో ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబులెన్స్‌లో అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాయదుర్గంటౌన్: మండలంలోని టి.వీరాపురం గ్రామం దొణగంగమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. డి.కొండాపురం శేఖన్న, రాజప్ప ద్విచక్ర వాహనంపై రాయదుర్గానికి వెళ్లి కొండాపురానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరినీ ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని మెయిన్‌బజార్ (గాంధీసర్కిల్)లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచు మోనాలిసా అధ్యక్షతన పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యులు అచ్చనాల మధుసూదన్, మేరీ, అరుణమ్మ, రాధమ్మ తదితరులు మాట్లాడుతూ మెయిన్‌బజార్‌లో షాపుల నిర్వాహకులు రోడ్డుకు అడ్డంగా ముందుకు రావడంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

రాయదుర్గంటౌన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రైటర్లు, ప్రైవేట్ వ్యక్తుల అక్రమాలపై విచారణ చేపట్టా చర్యలు తీసుకోవాలని పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ మాట్లాడుతూ రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాలకు చెందిన ప్రజలు, రైతులు భూ క్రయ,విక్రయాలు, ఇంటి స్థలాల సమస్యలు ఇలా వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల నుంచి అధిక మొత్తంలో రైటర్లు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్టాంపులకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కాదని అత్యధిక మొత్తంలో వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీటన్నింటిపై విచారించి చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు నరసింహులు, తిప్పేస్వామి, మారెన్న, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

చిరుత సంచారం

కూడేరు: మండల కేంద్రం కూడేరు-తలుపూరు గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో శుక్రవారం వేకువజామున చిరుత పులి కనిపించిందని స్థానికులు, రైతులు భయాందోళన చెందారు. దూరంలో ఉన్న చిరుతను చూసి కుక్కలు మొరగడంతో పొలాల వద్దకు అటుగా వెళ్తున్న రైతులు చూశారు. పెద్ద శబ్దం చేస్తూ కేకలు వేశారు. దీంతో చిరుత కొండ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని చెప్పారు.